
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 16.1
ANDHRAJYOTHY


జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
గురువారం 21 నవంబరు 2024

కోటా నింపుకునేందుకే.. కొనుగోళ్లు



మహబూబ్‌నగర్ జిల్లా కోటకదిరలో రైతు పొలం పక్కనే పచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

- రైతుల కల్లాల వద్దే ధాన్యం కొంటున్న బ్లాక్ లిస్టెడ్ రైస్‌మిల్లర్లు
- ఆ ధాన్యంతో పెండింగ్ సీఎంఆర్ భర్తీకి ఏర్పాట్లు
- రాష్ట్రంలో 15 లక్షల టన్నుల మేర గత సీజన్ల ధాన్యం మాయం
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద మందకొడిగా ధాన్యం సేకరణ
- నారాయణపేట, గద్వాల ధాన్యం రాయిచూర్ మార్కెట్‌కు తరలింపు
- ధర తక్కువ వస్తున్నా పచ్చి ధాన్యమే కొనడంతో రైతులు సుముఖం

గత సీజన్‌లలో ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వని మిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం డీఫాల్ట్ లిస్టులో పెట్టింది. దీంతో ఆ మిల్లులకు ఈ ఏడాది ధాన్యం కేటాయించడం లేదు. కొన్నేళ్లుగా పౌరసరఫరాల శాఖ కేటాయించే ధాన్యంపై ఆధారపడి వ్యాపారం చేస్తున్న మిల్లర్లు చాలా మంది డీఫాల్ట్ లిస్టులోకి వెళ్లడంతో ధాన్యం కేటాయింపులు నిలిపివేశారు. అంతే కాకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మిల్లర్లు సీఎంఆర్ పెండింగ్ పెట్టకుండా ఉండేందుకు బ్యాంకు గ్యారెంటీ తీసుకువచ్చింది. దీంతో డీఫాల్ట్ మిల్లుల యజమానులకు జరిమానా విధించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండటంతో సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లుల యజమానులు తాజాగా రైతుల నుంచి ధాన్యం సేకరణలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం మాత్రమే తీసుకుంటున్నారు. కానీ, దళారులు, రైస్ మిల్లర్లు పచ్చి ధాన్యం కూడా తీసుకుంటుండటం, కల్లాల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తుండటంతో పాటు చెల్లింపులు అదే రోజు లేదా మరుసటి రోజు చేస్తుండటంతో రైతులు వారికే విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

జిల్లాల వారీగా కొనుగోళ్లు ఇలా..

జిల్లా	కొనుగోలు కేంద్రాలు	సేకరించిన ధాన్యం (టన్నుల్లో)	ఖాతాల్లో జమ మొత్తం
మహబూబ్‌నగర్	189	5814	రూ. 1.13 కోట్లు
నాగర్‌కర్నూలు	252	162	
వనపర్తి	287	10000	రూ. 2.95 కోట్లు
జోగుళాంబ గద్వాల	64	75	
నారాయణపేట	101	3108	రూ. 0. 70 కోట్లు

మహబూబ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యాన్ని అమ్ముకొని సొమ్ము చేసుకున్న మిల్లర్లు ఇప్పుడు తాజా ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకురావడంతో ఇరకాటంలో పడ్డ విషయం తెలిసిందే. ప్రస్తుతం వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైనప్పటికీ సీఎంఆర్ పెండింగ్ లేని మిల్లుల నుంచి మాత్రమే అధికారులు అగ్రిమెంట్లు, బ్యాంక్ గ్యారెంటీలు తీసుకుంటున్నారు. గత సీజన్‌లలో పెండింగ్ ఉన్న మిల్లర్లకు కేటాయింపులు చేయకుండా కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని గోదాంలలో నిల్వ చేస్తున్నారు. ఏళ్లుగా పౌరసరఫరాల శాఖ కేటాయించే ధాన్యంపై ఆధారపడి వ్యాపారం చేస్తున్న మిల్లర్లు ఈసారి డీఫాల్ట్ మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేయకపోవడం, మిల్లు నడిపించాలంటే సొంతంగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడటంతో పెండింగ్ సీఎంఆర్ భర్తీ చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రస్తుత సీజన్‌లో కోతలు ముమ్మరంగా

మిగతా 6వ పేజీలో..



వనపర్తిలో వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న కూలీలు

వీధిన పడుతున్న కుటుంబాలు

- వనపర్తి జిల్లాలో ఆందోళన కలిగిస్తున్న రోడ్డు ప్రమాదాలు
- మద్యం మత్తు, అనుభవం లేని తనంతోనే అధికం
- ఈ ఏడాది 225 ప్రమాదాల్లో.. 126 మంది మృతి
- ఈ నెలలోనే ఎనిమిది మంది దుర్మరణం

వనపర్తి క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలో ఇటీవల జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రతీ రోజు ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంది. ఈ ప్రమాదాలలో పలువురు మృతి చెందడంతో పాటు గాయాలపాలైన వారి సంఖ్య కూడా పెరుగుతోంది. జిల్లాలో ఉన్న జాతీయ రహదారి, గ్రామీణ రహదారులపై కూడా నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, అనుభవంలేని తనంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై ఎక్కువ శాతం తెల్లవారుజామున ప్రమాదాలు జరుగుతున్నాయి.

అడ్డగోలుగా మద్యం విక్రయాలు..

జిల్లాలోని జాతీయ రహదారితో పాటు గ్రామీణ రోడ్ల వెంబడి దాబాలతో పాటు కిరాణ దుకాణాలలో 24 గంటలు మద్యం విక్రయిస్తుండడంతో వాహన దారులు మద్యం తాగి వాహనాలను నడిపిస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరుగతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ తతంగమంతా పోలీస్, ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే నడుస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. చాలాసార్లు గ్రామీణ యువత సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా బెల్ట్ షాపుల నిర్వహణను కట్టడి చేయలేకపోతున్నారు.



ఈ ఏడాది జిల్లాలో 225 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 126 మంది మృతి చెందారు. 237 మంది గాయపడ్డారు. గతేడాది జరిగిన 218 రోడ్డు ప్రమాదాల్లో 124 మంది మృతి చెందారు. 200 మంది గాయపడ్డారు. గతేడాది కంటే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగింది. ప్రమాదాలను నివారించేందుకు రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ నెలలో పదిరోజుల వ్యవధిలోనే ఎనిమిది మంది మృతి చెందారు. 9వ తేదీన వనపర్తి మండలంలోని సవాయిగూడెం వద్ద కూలీలు వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు మృతి చెందారు. అదే రోజు రేవల్లి మండలంలోని చెన్నారం సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందారు. 10వ తేదీన అమరచింత మండలంలోని మస్తీపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. 13వ తేదీన ముమ్మళ్లపల్లి వద్ద ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. 16వ తేదీన పెద్దమందడి బుగ్గవాగు వద్ద బోర్ వెల్ లారీ బోల్తా పడి ఒకరు మృతి చెందారు. 17న చిమనగుంటపల్లి వద్ద ద్విచక్ర వాహనాన్ని వడ్ల లారీ ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు.

చాయ్ కాకా

- కందనూలులో ఫేమస్ మైనొద్దీన్ 'మొబైల్ టీ'
- ఫోన్‌లో ఆర్డర్ ఇస్తే చేతికందే తేనీరు



7

కోట బురుజులు చరిత్రకు ఆనవాళ్లు

- సంస్థానాధీశుల కాలంలో నిర్మాణం
- శిథిలం అవుతున్న అలనాటి కట్టడాలు



యాపట్లలోని బురుజు

7

రావమ్మా మహాలక్ష్మి

- స్త్రీ శక్తి బలోపేతానికి ప్రభుత్వం కృషి
- రూ. 10 లక్షలు ఉచిత జీవిత బీమా, రుణ బీమా అవకాశాలు



6

గుజరాత్ రైతుల పైనే ప్రేమ

- తెలంగాణ రైతులపై ఎందుకు లేదు
- కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతు
- ఊట్కూరులో కాటన్ మిల్లు పరిశీలన

7

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



తెలకపల్లిలో శ్రీనిధి బ్యాంకు లింకేజీ ద్వారా పెంచుతున్న పెరటి కోళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్/పెద్దకొత్తపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దముద్దునూర్, పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్, తెలకపల్లి మండలంలోని వట్టిపల్లి గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా శ్రీనిధి బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు పొంది ఏర్పాటు చేసిన వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లాలో పెరటికోళ్ల పెంపకాన్ని విస్తృతంగా చేపట్టాలని, గ్రామీణ మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంతో జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు ద్వారా రుణాలు అందజేసి వారి వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లాలో 12రకాల వివిధ వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు మహిళలకు అవసరమైన సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నామని మహిళా సంఘాలచే మీ సేవ కేంద్రాలు ఆహార శుద్ధి కేంద్రాలు, పౌల్ట్రీ యూనిట్ మొదలగు వివిధ వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. కలెక్టర్ వెంట శ్రీనిధి అదనపు పీడీ లక్ష్మీనారాయణ, డీపీఎం అరుణాదేవి, డీఆర్‌డీపీ శ్రీనిధి, అధికారులు, మండల స్థాయి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరును సస్యశ్యామలం చేశాం

- రూ. 4 వేల కోట్లు ఖర్చుతో.. 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు
- ఉమ్మడి జిల్లాలో అయిదు మెడికల్ కాలేజీలతో అందుబాటులో వైద్యం
- కురుమూర్తి వద్ద విలేకరులతో మాట్లాడిన మాజీ మంత్రి హరీశ్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

మహబూబ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పెండింగ్ ప్రాజెక్టుల ను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి ఉమ్మడి పాలమూరు జిల్లాను బీఆర్ఎస్ హయాంలో సస్యశ్యామలం చేశామని, రూ. 4వేల కోట్లు ఖర్చు చేయడం ద్వారా 6.50లక్షల ఎకరాలకు నీళ్లిచ్చామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలంలో బుధవారం కురుమూర్తి స్వామి బ్రహోత్సవా ల్లో పాల్గొన్న ఆయన.. పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము పెండింగ్ ప్రాజెక్టులను రాత్రిం బవళ్లు వాటి వద్ద నిద్ర చేసి పూర్తిచేస్తే.. స్వరాష్ట్రం ఏర్పడి న తర్వాత ప్రారంభమైన పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అడ్డుపుల్లలు వేసినా.. దాదాపు పూర్తిచేశామని, స్వల్ప పనులు చేస్తే పూర్తయ్యే ప్రాజెక్టును పడావు పెట్టిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని విమర్శించారు. ఈ ఏడు వరదలు బాగా వచ్చినా వినియోగించుకోక పోవడంతో నీరంతా సముద్రం పాలైందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో అయిదు మెడికల్ కాలేజీలు నిర్మించి.. వైద్యాన్ని, వైద్య విద్యను చేరువ చేశామని, జేఎన్‌టీ యూ, ఫిషరీష్, అగ్రికల్చర్ బీఎస్సీ కాలేజీల ను మంజూరు చేశామన్నారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్‌రెడ్డి.. ఈ ప్రాంతానికి ఉన్న మంచిపేరును చెడగొడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హ యాంలో రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేశామని, ఇప్పుడు ధాన్యం, పత్తి కొనుగోలు

మిగతా 6వ పేజీలో...

స్కూల్ బస్సును ఢీకొట్టిన ట్రాక్టర్

- బస్సు బోల్తా, తప్పిన ప్రాణాపాయం
- 18 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరికి గాయాలు

బిజినేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలకు విద్యార్థులను తీసుకొని వస్తున్న బస్సును పొలంలో నుంచి రోడ్డుపైకి ఎక్కే క్ర మంలో ట్రాక్టర్ ఢీకొనడంలో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డ ఘటన బుధవారం నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు తిమ్మాజిపేట మండలం కోడుపర్తి గ్రామంలో విద్యార్థులను ఎక్కించుకొని మరో గ్రామం బాజీపూర్‌లో ఉన్న విద్యా ర్థులను ఎక్కించుకునేందుకు బయలుదేరింది. వట్టెం సమీపంలో రోడ్డుకు ఇరు వైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో రోడ్డుపై వస్తున్న బస్సును గమనించని డ్రైవర్ పొలంలో నుంచి రోడ్డుపైకి ట్రాక్టర్‌ను ఎక్కించాడు. చివరి క్షణంలో ట్రాక్టర్‌ను గమనించిన బస్సు డ్రైవర్ ట్రాక్టర్‌ను తప్పించేందుకు మరోవైపు రోడ్డు కిందకు బస్సును దించాడు. వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీ కొట్టడంతో బస్సు బోల్తా పడింది. వెంటనే పొలాల్లో ఉన్న రైతులు గమనించి బస్సు అద్దాలను పగులగొట్టి చిన్నారులను బయటకు తీశారు. బస్సులో ఉన్న 18 మంది విద్యార్థుల్లో రోహిత్, ప్రియాంక స్వల్పంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గాయాలైన విద్యార్థులను 108 అంబు లెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు.

పాఠశాల యాజమాన్యానికి షోకాజ్ నోటీసు

బస్సు ప్రమాదం జరిగి ప్రాణాపాయం జరుగకున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యానికి డీఈవో గోవిందరాజులు షోకాజు నోటీసు ఇచ్చారు. పాఠశాల గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల భద్రతకు ప్రాముఖ్యం ఇవ్వకపోయినా, బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల సామర్థ్యం పరిశీలన ఎప్పటికప్పుడు చేయకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదం జరిగిన స్థలాన్ని ఆయన పరిశీలించారు.

కలెక్టర్ కుటుంబ వివరాలు సేకరించిన సర్వే బృందం

వనపర్తిరాజీవ్‌చౌరస్తా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం సర్వే అధికారులు కలెక్టర్ ఆదర్శ్ సురభి కుటుంబ వివరాలు సేకరించారు. మర్రి కుంటలోని కలెక్టరేట్ వెనుక ఉన్న ఆయన నివాసానికి ఎన్యుమరేటర్ గోవిందు, సూపర్ వైజర్ సరస్వతి వెళ్లి కలెక్టర్ కుటుంబ వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు.



వివరాలు తెలియజేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

కళకళలాడుతున్న కంది

- గద్వాల జిల్లాలో 47 వేల ఎకరాల్లో సాగు
- గతేడాదికంటే 20 వేల ఎకరాలు పెరిగిన సాగు విస్తీర్ణం
- ఎకరాకు 5 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం
- గిట్టుబాటు ధర కల్పించాలంటున్న రైతులు



అయిజ శివారులో ఏపుగా పెరిగిన కందిపంట

6

రేపు బీసీ కమిషన్ రాక

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ కోసం బీసీ కమిషన్ ఈ నెల 22న మహబూబ్‌నగర్‌కు రానుందని కలెక్టర్ విజయేందిర బోయి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలు పడుతున్న ఇబ్బందులను, వారి సంక్షేమానికి నిధులు కేటాయించడానికి ప్రభుత్వానికి సిఫార్సులు చేయాలని తెలంగాణ బీసీ కమిషన్ భావిస్తున్నదన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు మహబూబ్‌నగర్ జిల్లా, 11 నుంచి 12 గంటల వరకు నాగర్‌కర్నూల్ జిల్లా, మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు వనపర్తి జిల్లా, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు జోగుళాంబ గద్వాల జిల్లా, 3 గంటల నుంచి 4 గంటల వరకు నారాయణపేట జిల్లాకు సంబంధించి అభిప్రాయ సేకరణ ఉంటుందని ఆమె తెలిపారు.

అందుబాటులోకి యోగా సెంటర్లు

- వారం పది రోజుల్లో శిక్షణ
- నియామక పత్రాలు అందుకున్న ట్రైనర్లు

వనపర్తి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత పరిస్థితుల్లో సంపూర్ణ ఆరోగ్యం పొందాలంటే యోగా తప్పనిసరి. యోగా ప్రాధాన్యతను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసింది. జిల్లాలో తొమ్మిది యోగా కేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కేంద్రాలు కూడా వినియోగంలోకి వచ్చాయి. యోగాపై శిక్షణ ఇచ్చేందుకు నియామకాలు చేపట్టింది. నేషనల్ ఆయుష్ మిషన్ ప్రకటించినట్లు జిల్లాలో దాదాపు 30కి పైగా యోగా కేంద్రాలను ఏర్పాటు చేయవలసి ఉండగా.. ప్రస్తుతం మండలానికి ఒకటి చొప్పున తొమ్మిది కేంద్రాలను మంజూరు చేసింది. ఒక్కొక్క కేంద్రానికి రూ. 6 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో యోగా కోసం షెడ్లు నిర్మించారు. ప్రతీ కేంద్రానికి ఒక మహిళ, ఒక పురుషుడి చొప్పున ట్రైనర్లకు నియామక పత్రాలు అందజేశారు. జిల్లాలో యోగా కేంద్రాల్లో వారం పది రోజుల్లో శిక్షణ తరగతులు ప్రారంభించనున్నారు. యోగా కేంద్రాలు అందుబాటులోకి వస్తున్నాయని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పెద్దగూడెం గ్రామంలోని యోగా కేంద్రం

యోగా శిక్షణ ఇస్తే బాగుంటది



మా గ్రామంలో యోగా శిక్షణ కేంద్రం అందుబాటులోకి రావడం సంతోషగా ఉంది. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం యోగా నేర్పిస్తే చాలా మందికి ఉపయోగపడుతోంది. ప్రతీ మనిషికి యోగా అవసరం. యోగాతోనే ఆరోగ్యం.

- చిన్న, పెద్దగూడెం

బస్సులో మరిచిన వస్తువుల అందజేత


ప్రయాణికుడు సాయిగోపాల్‌కు బస్సులో మరిచిన వస్తువులను అందజేస్తున్న డీఎం సుజాత

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఆర్టీసీ బస్సులో ప్రయాణకుడు మరిచిపోయిన విలువైన ప్రింటర్‌పార్టును, సదరు ప్రయాణికుడికి అందజేసి తమ నిజాయతీని చాటుకున్నారు మహబూబ్‌నగర్ ఆర్టీసీ సిబ్బంది. హైదరాబాద్ నుంచి రాయిచూర్ వెళ్లే కర్ణాటక ఆర్టీసీ బస్సులో సాయి గోపాల్ అనే ప్రయాణికుడి హైదరాబాద్‌లో బస్సు ఎక్కి. రూ.30 వేల విలువైన ప్రింటర్ పార్టును మరిచిపోయి జడ్చర్లలో దిగిపోయాడు. తర్వాత తన వస్తువు గుర్తుకొచ్చి బస్టాండ్‌లో బస్సు కోసం వెతకగా అప్పటికే వెళ్ళిపోయింది. వెంటనే మహబూబ్‌నగర్ డిపో మేనేజర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించగా, మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో డ్యూటీలో ఉన్న కంట్రోలర్ చారి బస్సులోని వస్తువును స్వాధీనం చేసుకోని డీఎం సుజాత, ఎస్ఎం రవీందర్‌రెడ్డి, బసప్ప సమక్షంలో సాయిగోపాల్‌కు అందజేశారు.

ఎస్జీఎఫ్ అథ్లెటిక్స్‌లో జడ్చర్ల విద్యార్థికి మూడో స్థానం


అంకురి జీవన్

జడ్చర్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థి అంకురి జీవన్ ఎస్జీఎఫ్ అథ్లెటిక్ పోటీల్లో మూడవ స్థానం సాధించాడని కళాశాల ప్రిన్సిపాల్ ఉమామ హేశ్వర్ బుధవారం తెలిపారు. వరంగల్లు జిల్లాలోని నెహ్రూ స్టేడియంలో ఇటీవల జరిగిన 400, 800 మీటర్ల పరుగు పందెంలో మూడోస్థానం సాధించాడని పేర్కొన్నారు. విద్యార్థిని ప్రిన్సిపాల్, అధ్యా పకులు రామకృష్ణగౌడ్, రఘురాం అభినందించారు.

రావమ్మా.. మహాలక్ష్మి

- స్త్రీ శక్తి బలోపేతానికి ప్రభుత్వ కృషి
- రూ. 10 లక్షలు ఉచిత జీవిత బీమా, రుణ బీమా అవకాశాలు


గట్టులో మహిళా సంఘ సభ్యులతో జరిగిన ప్రత్యేక సమావేశం(ఫైల్)

అయిజ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోంది. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికపరంగా నిలదొక్కుకోటానికి పూర్తి స్థాయిలో చేయూత అందిస్తోంది. మహిళా సంఘ సభ్యుల కుటుంబాలకు పూర్తి స్థాయిలో భరోసా సైతం అందిస్తోంది. ఆకాశంలో సగం కాదు అన్నింట్లోను సగభాగాలుగా చేయూత సమకూర్చుతోంది. ఇప్పటికే మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు వడ్డీలేని రుణాలు అందించటమే కాకుండా వారికి రుణ బీమా, ప్రమాద బీమా సౌకర్యం కల్పించారు. అందుకు అవసరమైన నిధులు సైతం విడుదల చేశారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు మాత్రమే రూ. 10 లక్షల ప్రమాద బీమా, రుణ బీమా సౌకర్యాన్ని సైతం కల్పించటం జరిగింది. మహిళా స్వయం సహాయక సంఘాలు తీసుకునే రూ. రెండు లక్షల వరకు రుణాలకు ఇన్సూరెన్స్ (రిస్క్ కవరేజ్) కోసం శ్రీ నిధి సమాఖ్యకు ప్రభుత్వం రూ.50.41కోట్లు విడుదల చేయటం జరిగింది. ప్రస్తుత చనిపోయిన వివరాలు ప్రభుత్వం సేకరించి ఉంచుకొంది. త్వరలో చనిపోయిన స్వయం సహాయక సంఘ మహిళా కుటుంబ సభ్యులకు రావాల్సిన లబ్ధిని అందచేయనున్నారు.

భద్రత, భరోసా ఉన్నట్లే



ప్రభుత్వం కల్పించిన అవకాశాలు మహిళా సంఘ సభ్యులకు జీవనోపాధితో కూడిన ఆర్థిక భద్రత ఉన్నట్లే. ఆర్థికాభివృద్ధి సాధించటానికి రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తుంది. జీవనోపాధి కల్పిస్తుంది. తన కుటుంబానికి ఆసరాగా ఉండటమే కాకుండా ఆదాయంలో తను ఒక భాగం అయ్యి ఉంటుంది. ప్రభుత్వం కల్పించిన ఉచిత బీమాతో ఆమె కుటుంబానికి భరోసా లభిస్తుంది.

- నర్సింగరావు, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్

ఇందిరా మహిళా శక్తి సంబురాలు

ఈ నెల 14వ తేదీ నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ, మండలాలలో మండల మహిళా సమాఖ్య సంబురాలను నిర్వహిస్తోంది. మహిళా సమాఖ్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. సభ్యులను ప్రోత్సహిస్తూ సన్మానాలు చేస్తున్నారు. మహిళా సంఘాలను పెంపొందించటానికి, బలోపేతం చేయటానికి తీవ్ర కృషి చేస్తున్నారు. కొత్త సంఘాలకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను, పొందే లబ్ధిలను తెలియచెబుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 6,791 మహిళా సంఘాలు ఉన్నాయి. అందులో 75,746 మంది సంఘ సభ్యులుగా మహిళలు కొనసాగుతున్నారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కొత్త సభ్యులను చేర్చుకుంటున్నారు. రుణ బీమా పథకం, ప్రమాద బీమా పథకం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, యూనిఫాంల తయారీ సభ్యులకు అప్పగింత, డ్వాక్రా బజార్ ఏర్పాటు, వడ్డీలేని రుణాలు వంటి వాటిని మహిళలకు అందచేస్తున్న విషయాలు తెలియచేస్తున్నారు. మహిళకు గేదెలు ఇప్పించటం, నాటు కోళ్ల పెంపకం, పిండి గిర్నీ, రొట్టెల తయారీ మిషన్ ఏర్పాటు, ఇతర జీవనోపాధి యూనిట్ల ఏర్పాటు, కుట్టు మిషన్‌లు, కంది బ్యాళ్ల మిష న్‌ల ఏర్పాటు ప్రభుత్వ సహకారం గురించి వివరిస్తున్నారు.

కుంకుమ తిలకంతో ఇంటింటికి తిరిగి ఆహ్వానం

మహిళా సమాఖ్య సంబురాలలో భాగంగా స్వయం సహాయక సంఘాలలో పనిచేస్తున్న ఏపీఎం (అసిస్టెంట్, ప్రాజెక్టు మేనేజర్), సీసీ (కమ్యూనిటీ కో ఆర్డీనేటర్)లు, వీవోఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)లు సమాఖ్య సిబ్బంది కొత్త సభ్యులను ఆహ్వానించటంలోను, సభ్యులుగా చేర్చుకోవటంలోను తలమునకలై ఉన్నారు. సభ్యులుగా లేని వారిని గుర్తించి ఇంటింటికి తిరిగి కుంకుమ తిలకం పెట్టి సభ్యులుగా ఆహ్వానిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, లబ్ధి, భరోసా గురించి తెలియపరుస్తూ అవగాహన కలుగచేస్తున్నారు. జిల్లా స్థాయిలో జిల్లా స్థాయి ప్రాజెక్టు మేనేజర్లు, జిల్లా స్థాయి అధికారులు తలమునకలై ఉన్నారు.

ఉచిత బీమాతో కుటుంబ భరోసా

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సమాఖ్య సభ్యురాలుకు వడ్డీలేని రుణాలతో ఉపాధి కల్పించటమే కాకుండా కుటుంబ సభ్యులకు ఉచిత బీమాతో భరోసా ఇస్తోంది. 2024 మార్చి 14 నుంచి ప్రవేశపెట్టబడినప్పటికీ ఇప్పటి వరకు చనిపోయిన వారి వివరాలు పొందుపరచలేదు. ఈ విషయం తెలియచెప్పటానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో రుణ బీమా, జీవిత బీమా సౌకర్యం మహిళా సంఘ సభ్యులకు కల్పించింది. సంఘంలో సభ్యులుగా ఉన్న మహిళ చనిపోతే ఆమె తీసుకున్న రుణంలో ఇంకా ఎంత అప్పు ఉందో తెలుసుకుని ఆ మొత్తాన్ని ప్రభుత్వం మహిళా సంఘ సభ్యుల ఖాతాలో జమ చేస్తుంది. ఆ డబ్బును బ్యాంకుకు సభ్యులు చెల్లిస్తారు. ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబ సభ్యులకు రూ. 10 లక్షలు బీమా కింద అందచేస్తారు. సాధారణ మరణం సంభవిస్తే రూ. 2 లక్షల వరకు రుణం మాఫీ అవుతుంది. సంఘంలో సభ్యులై ఉండాలి, వయస్సు 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలలోపు ఉండాలి. జీవో నెంబర్ ఆర్‌టీ నెంబరు 217 విడుదల చేసింది.

పాలమూరును సస్యశ్యామలం చేశాం

(మొదటిపేజీ తరువాయి)

చేయకపోవడంతో రైతులు గోస పడుతున్నారని తెలిపారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను బాగు చేయడంతోపాటు.. ఊకచెట్టి వాగు, కందూరు పెద్దవాగులపై 32 చెక్‌డ్యాంలు నిర్మించి.. భూగర్భజలాలను పెంచామని అన్నారు. వ్యవసాయాన్ని కేసీఆర్ పండుగలా చేస్తే.. రేవంత్ దాన్ని నాశనం చేస్తున్నారని అన్నారు. వరంగల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం తక్కువ చేయలేదని అంటున్న రేవంత్‌రెడ్డి.. కేసీఆర్ కిట్, రైతుబంధు, న్యూట్రీషన్ కిట్, చేపపిల్లలు, రెండో విడత గొర్రె పిల్లల పంపిణీ, దళితబంధు, బీసీబంధు అమలు చేస్తున్నారా? అని ప్రశ్నించారు.

ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదని, మహిళలకు రూ. 2500 భృతి, రూ. 4వేల పింఛన్, రైతు భరోసా కింద రూ. 15వేల పెట్టుబడి సాయం, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు సాయం, అన్ని పంటలకు బోనస్‌ను మరిచిపోయారని ఆరోపించారు. ఇక్కడ రూ. 2500 ఇవ్వలేదు కానీ.. మహారాష్ట్రకు పోయి అక్కడ రూ. 3వేలు ఇస్తామని చెబుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి మహిళలకు వడ్డీ లేని రుణాలు కూడా అందడం లేదన్నారు. కురుమూర్తి స్వామి మీద ఒట్టు పెట్టి.. పంద్రాగష్టులోగా రుణమాఫీ చేస్తామని ప్రకటించి.. ఇప్పటివరకు పూర్తిచేయలేదన్నారు. హామీ సమయంలో రూ. 41వేల కోట్లు మాఫీ చేస్తామని, తర్వాత దాన్ని రూ. 36వేల కోట్లకు, బడ్జెట్‌లో రూ. 26వేల కోట్లు పెట్టి.. రూ. 17వేల కోట్లు మాఫీ చేశారని విమర్శించారు. రూ. 2లక్షల పైన ఉన్న వారు మిగతా సొమ్ము అప్పు తెచ్చి కట్టి మాఫీ కోసం ఎదురుచూస్తున్నారని, తెచ్చిన అప్పుకు వడ్డీ పెరుగుతుందే కానీ మాఫీ మాత్రం కావడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ మంత్రులు, ఎమ్మెల్యేల జీతాలు ఆపి మరి రైతుబంధు వేశామని, ఇప్పుడు అది పడటం లేదన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత పడ్డ మొత్తం కూడా.. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పాస్ చేసిన బడ్జెట్‌ను అప్పుడు అడ్డుకున్నదేనని గుర్తుచేశారు. 2014కు ముందు రాష్ట్రంలో 30లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే.. ప్రస్తుతం 1.59లక్షల ధాన్యం పండుతోందని అన్నారు.

కేసీఆర్ హయాంలో కల్యాణలక్ష్మి పథకం కింద 13లక్షల పేదింటి ఆడపిల్లలకు రూ. 11వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. పౌరసరఫరాల మంత్రి 90లక్షల ధాన్యం కొంటామని చెబుతుండగా.. కమిషనర్ 70లక్షల టన్నులు అంటున్నారని, ఇప్పటివరకు 15లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని అన్నారు. 25లక్షల మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు చేయాల్సి ఉండగా.. లక్ష టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు.

ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్ల ధర కూడా తక్కువగా వస్తోందని తెలిపారు. ఆలోచన చేసుకుని, ఆత్మవిమర్శ చేసుకుని పరిపాలన అందించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి స్వామిని దర్శించుకున్న హరీశ్‌రావు


కురుమూర్తి స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

చిన్నచింతకుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వరస్వామిని బుధవారం బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు దర్శించుకున్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడు, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రాంమోహన్ రెడ్డి, గువ్వల బాలరాజు, తెలంగాణా స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాసులు, రజినీ సాయిచంద్, నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు. అంతకు ముందు అర్చకులు మాజీ మంత్రులకు ఘనస్వాగతం పలికారు. జాతరలో కాలినడకన స్వామివారి రాజగోపురంకు చేరుకున్నారు. అక్కడినుంచి మెట్లదారిగుండా స్వామిని దర్శించుకున్నారు. అలాగే ఉద్దాలను తాకి తరించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోట రాము, సీనియర్ నాయకుడు కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు హర్షవర్ధన్‌రెడ్డి, గుంతా మౌనిక, మాజీ జడ్పీటీసీ వట్టెం రాజేశ్వరిరాము తదితరులు పాల్గొన్నారు.

భూమి పైసలు ఇస్తలేరు

- మాజీ మంత్రితో రైతుల ఆవేదన

మదనాపురం(ఆంధ్రజ్యోతి): కురుమూర్తి స్వామి దర్శనానికి వెళ్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు బుధవారం మదనాపురం మండలంలోని నెల్విడి కాలనీ దగ్గర వడ్లు ఆరబోస్తున్న రైతులతో కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు.

రైతు కృష్ణయ్య: వడ్లూ కొంటలేరు సారూ

మాజీ మంత్రి: వడ్లు ఎప్పుడు తెచ్చినవు

రైతు కృష్ణయ్య: పది రోజుల నుంచి ఆరబోసినా గాని తేమ వస్తాలేదని చెబుతున్నారు.

శాంతమ్మ: భూమి పైసలు ఇస్తలేరు.

మాజీ మంత్రి: రైతుబంధు రూ.15వేలు ఇస్తామని చెప్పినారు కదా..ఎందుకు ఇస్తలేరు

శాంతమ్మ: కేసీఆర్ సారు ఉన్నప్పుడే రైతుబంధు, బతుకమ్మ చీరలు, పింఛన్‌లు ఇచ్చిండ్రు. ఆయన ఉన్నప్పుడు కడుపునిండా తిన్నాం.

రాధమ్మ: వడ్లు బయట అమ్ముకున్నాం. ఆరు ఎకరాలు వరి సేను కోసి 20 రోజుల నుంచి వడ్లు ఆరబోసినా తేమ వస్తలేదని అంటుండ్రు. దీని వలన కూలీల ఖర్చు, పడేల ఖర్చు భరించ లేక రూ. 2100కే బయటికి అమ్మినామంటూ ఆయన ముందు వెలిబుచ్చుకున్నారు.


నెల్విడి కాలనీ వద్ద రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

కోటా నింపుకునేందుకే కొనుగోళ్లు

(మొదటి పేజీ తరువాయి...)

జరుగుతుండగా రైతుల కల్లాల వద్దకే వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. రైతులకు ధర తక్కువగా ఇస్తున్నప్పటికీ వెంటనే కొనుగోళ్లు జరిగిపోతుండటం పచ్చి వడ్లనే తీసుకుంటుండటం, డబ్బులు వేగంగా చెల్లించడం, కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షణ తప్పనుండటంతో రైతులూ సుముఖంగానే ధాన్యం విక్రయిస్తున్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు నిర్వహించగా దాదాపు రూ.3301 కోట్ల విలువైన 15 లక్షల టన్నుల ధాన్యం మాయమైనట్లు గుర్తించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మిల్లర్లు సీఎంఆర్ పెండింగ్ పెట్టకుండా ఉండేందుకు బ్యాంకు గ్యారెంటీలు తీసుకురావడంతో పాటు పెండింగ్ ఉన్న మిల్లుల వారికి జరిమానా విధించేందుకు విధాన రూపకల్పన చేయడంతోనే మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం సేకరణలో నిమగ్నమయ్యారు.


మహబూబ్‌నగర్ జిల్లా కోటకదిరలో రైతు పొలం పక్కనే పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసి లారీలో లోడ్ చేసిన వ్యాపారులు, కోసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో తీసుకువచ్చి రోడ్డుపై ఆరబోస్తున్న రైతు

- కలిసి వస్తున్న మందకొడి సేకరణ...

ప్రస్తుతం ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం సేకరణ మందకొడిగా సాగుతుండటం రైస్‌మిల్లర్లకు వరంగా మారిందని చెప్పవచ్చు. అక్కడ వేగంగా కొనుగోలు చేస్తే ధర ఎక్కువగా వస్తుందని రైతులు అక్కడికే మొగ్గుచూపే అవకాశం ఉంది. ఉదాహరణకు ఈ సీజన్ ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకు అత్యధిక సేకరణ ఉన్న వనపర్తి జిల్లాలో కేవలం 10వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ధాన్యం కొనుగోలు చేశారు. ఈ జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయాల్సి ఉంది. అలాగే ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం సన్న రకాలకు బోనస్ ప్రకటించడంతో వాటి కొనుగోళ్లు వేరుగా చేపట్టాల్సి వస్తోంది. కొనుగోళ్ల నుంచి రవాణా వరకు అన్నీ ప్రత్యేకంగా చూసుకుంటుండటం, గన్నీ బ్యాగులపై ఓటీపీలు రాయడం వంటి కారణాల వల్ల ఆలస్యమవుతోంది. దీంతో కొంత తక్కువ ధరకు మిల్లర్లు వాటిని కొనుగోలు చేస్తున్నారు. వరి ధాన్యానికి ప్రస్తుతం కనీస మద్దతు ధర రూ. 2,300 కాగా, సన్న ధాన్యం అయితే మరో రూ. 500 బోనస్ కలుపుకొని రాష్ట్ర ప్రభుత్వం రూ. 2800 చెల్లిస్తోంది. దీనికి రైతు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించడం, దాన్ని నిర్దేశిత తేమశాతం వరకు ఆరబెట్టడం, సుదీర్ఘ నిరీక్షణ తర్వాత విక్రయించడం, డబ్బులు ఆలస్యంగా జమ కావడంతో రైతులు దళారులు లేదా రైస్‌మిల్లర్లకే విక్రయిస్తున్నారు. రూ. 2,200 నుంచి రూ. 2,400 వరకు దళారులు ధర చెల్లిస్తున్నారు. రైతులు ధాన్యం ఆరబోసిన ప్రాంతాలకే వెళ్లి కొనుగోలు చేస్తుండటంతో పాటు చెల్లింపులు అదే రోజు లేదా మరుసటి రోజు చేస్తుండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

సరిహద్దు ధాన్యం రాయిచూరుకే..

ప్రభుత్వం సన్నరకాల ధాన్యంపై రూ. 500 బోనస్ ప్రకటించడంతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సరిహద్దులో ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి దళారులు, మిల్లర్లు ధాన్యం తీసుకువచ్చి ఇక్కడ కొనుగోలు కేంద్రాల్లో రైతుల పేరుతో విక్రయించే అవకాశం ఉందని అధికారులు భావించారు. ఈ నేపథ్యంలో నారాయణపేట, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూలు జిల్లాల్లో ధాన్యం రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టులు కూడా ఏర్పాటు చేశారు. కానీ అధికారుల ఆలోచనలకు భిన్నంగా కర్ణాటక వ్యాపారులు, రైస్‌మిల్లర్లు, వారికి సంబంధించిన దళారులు ఇక్కడి రైతుల నుంచే ధాన్యం కొనుగోలు చేసి రాయిచూర్ మార్కెట్‌కు తరలిస్తున్నారు.

ఇప్పటికే నారాయణపేట, జోగుళాంబ గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మెజారిటీ ధాన్యం కర్ణాటక వ్యా పారులతో పాటు స్థానిక రైస్‌మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. దొడ్డు రకాల ధాన్యం ఇక్కడి రైస్ మిల్లర్లు కొనుగోలు చేస్తుండగా సన్నరకాల ధాన్యం మాత్రం రాయి చూర్ మార్కెట్‌కు సంబంధించిన దళారులు కొనుగోలు చేస్తున్నారు. యాసంగి సీజన్‌లో కూడా ఇక్కడి నుంచి కర్ణాటక వ్యా పారులు అధికంగా ధాన్యం కొనుగోలు చేసి తరలించారు. ఈ సీజన్‌లో కూడా అదే పరిస్థితి ఏర్పడుతోంది. రైతులు కూడా ఆసక్తిగా విక్రయిస్తుండటంతో పెద్దగా ఇబ్బందులు లేవనే చెప్పవచ్చు.

ఒంటరి తనంతో వ్యక్తి ఆత్మహత్య


చంద్రయ్య (ఫైల్)

కల్వకుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భార్య మృతి చెంది ఒంటరిగా ఉన్న ఓ వ్యక్తి మనస్తాపానికి గురై ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తిలో చోటు చేసుకున్నదని ఎస్ఐ జీ మాధవరెడ్డి తెలిపారు. స్థానిక ఇందిరానగర్ కాలనీకి చెందిన ఇత్తారి చంద్రయ్య (60) భార్య ఆరు నెలల క్రితం చనిపోయింది. ఒంటరిగా ఉంటూ తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన బుధవారం తన ఇంటిలోనే ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గుర్తించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చంద్రయ్య మృతి చెందాడు. మృతుడి అన్న కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి 23 వరకు జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

వనపర్తి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి పట్టణ కేంద్రంలోని సూర్యచంద్ర హైస్కూల్‌లో నేటి నుంచి 23 వరకు జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఉంటుందని డీఈవో గోవిందరాజులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

కళకళలాడుతున్న కంది

- గతేడాదికంటే 20 వేల ఎకరాలు పెరిగిన సాగు విస్తీర్ణం


అయిజ శివారులో కళకళలాడుతున్న కందిపంట

అయిజ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లుగా వర్షాభావ పరిస్థితుల కారణంగా సరైన పంటలు పండక రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ ఏడాది వరుణ దేవుడి కరుణించడంతో పంటలు బాగానే ఉన్నాయి. ఈ వానాకాలం సీజన్‌లో రైతులు వేసుకున్న కంది పంట కళకళలాడుతోంది. కంది రైతులు పైరును చూసి ఈ ఏడాది మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఈ ఏడాది 47వేల ఎకరాల్లో కందిపంట సాగు చేశారు. గతేడాది వర్షాలు సక్రమంగా లేకపోవటంతో జిల్లా మొత్తం 27,699 ఎకరాల్లో కంది పంట సాగైంది. కందిపంట సాగులో పెట్టుబడి పెద్దగా ఉండదు. రైతుకు పనిభారం కూడా తక్కువగానే ఉంటుంది. ముఖ్యంగా వ్యవసాయ కూలీలు తక్కువగా అవసరం పడే పంటల్లో కందిపంట ప్రధానమైనది. వర్షాధారంతో మాత్రమే పండే భూముల్లో ఎకరాకు 5-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

నీటి సౌలభ్యం ఉన్న భూముల్లో అయితే ఎకరాకు 7-8 క్వింటాళ్ల మధ్య దిగుబడి వస్తుంది. కందిపంట సాగుచేసేందుకు దుక్కులకు రూ.8 వేలు, అయిదు, ఆరు సార్లు పురుగుమందులు స్ప్రే చేసేందుకు మరో రూ. 8 వేలు, అదనంగా కలుపు తీసే, పంటకోసే కూలీలకు మరో రూ. 6 వేల వరకు కలిపి మొత్తం ఎకరానికి రూ. 22 వేల వరకు పెట్టుబడి ఖర్చులు అయ్యే అవకాశం ఉంది. గతేడాది క్వింటాళు కందులు రూ. 10 వేలపైనే ధర పలికింది. ఈ రకంగా చూసుకున్నా సాధారణంగా ఎకరాకు 7 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా లాభాలు వస్తాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. గద్వాల జిల్లాలో కంది పంట విస్తీర్ణం ఈ ఏడాది పెరిగింది. ధరలు ఆశించినంత ఉంటాయో లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. కంది రైతుల విషయంలో ప్రభుత్వం శ్రద్ధ తీసుకొని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఆశాజనకంగానే ఉంది

ఈ సంవత్సరం కంది పంటను రైతులు అధిక విస్తీర్ణంలో సాగుచేశారు. జిల్లాలో మొత్తం 47 వేల ఎకరాల్లో కందిపంట సాగైంది. గ్రామాల్లో, మండలాల్లో ఉండే మా వ్యవసాయాధికారులు కంది, ఇతర ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించటం వల్ల రైతులు కూడా కందిపంటను సాగుచేసుకున్నారు.

- సక్రియానాయక్, డీఏవో, గద్వాల

అందని మిషన్ భగీరథ బిల్లులు

- గుండెపోటుతో సబ్ కాంట్రాక్టర్ మృతి


జహీర్(ఫైల్)

అయిజ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాలుగా చేసిన పనులకు బిల్లులు అందకపోవటంతో మనస్తాపానికి గురైన జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణానికి చెందిన సబ్‌కాంట్రాక్టర్ జహీర్(51) గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలలో మిషన్ భగీరథ పనులు చేశారు. సీసీ రోడ్లు, పట్టణంలోని షైనార్టీ కమ్యూనిటీ హాలు నిర్మాణాలు చేశారు. రూ. 1.40 కోట్ల దాకా బిల్లులు రావాల్సి ఉంది. ఆ పనుల పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. చేసిన అప్పులకు వడ్డీ చెల్లించటం కోసం వావిలాల గ్రామంలో ఉన్న 10 ఎకరాల పొలం అమ్మాడు. బిల్లుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా రాకపోవటం, చేసిన అప్పులు తీర్చకపోవడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి గుండె పోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే అబ్రహాం పరామర్శించారు.

జములమ్మ ఆలయం

హుండీ లెక్కింపు

- రూ. 13.47 లక్షల ఆదాయం

గద్వాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నడిగడ్డ ప్రజల ఇలవేల్పు జములమ్మ తల్లీ ఆలయంలో బుధవారం హుండీని లెక్కించారు. ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఆలయ ఈవో పురేందర్‌కుమార్ సమక్షంలో జములమ్మ, పరుశరాముడి ఆలయంలో ఉన్న హుండీలను తెరిచారు. కుంకుమార్చన మండపంలో భక్తుల సమక్షంలో లెక్కింపు నిర్వహించారు. నాలుగు నెలల 17 రోజుల హుండీ రూ.13,47,805 వచ్చిందని ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు. ఇందులో నగదు రూపంలో రూ.12,71,255, చిల్లర రూపంలో రూ.76,550 వచ్చింది. మిశ్రమ వెండి మూడు కేజీల 150 గ్రాములు వచ్చిందని తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో లెక్కింపు నిర్వహించగా రూ.12,75,695 వచ్చిందని, గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.72,110 ఎక్కువ హుండీ వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు మురళీధర్‌రెడ్డి, రవి ప్రకాష్, రాజలింగం, నాగరాజు ఉన్నారు.


జములమ్మ ఆలయం హుండీని లెక్కిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది

స్పోర్ట్స్ బాక్స్

ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘానికి గుర్తింపు

▸▸ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్పీ వెంకటేశ్, కురుమూర్తిగౌడ్



ప్రతినిధులకు నియామకపత్రం అందిస్తున్న జగదీశ్‌యాదవ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఒలింపిక్ సంఘానికి గుర్తింపు లభించింది. సంఘం చైర్మన్‌గా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్పీ వెంకటేశ్, కురుమూర్తిగౌడ్, కోశాధికారిగా ఉమామహేశ్వర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా బాబులాల్ నియమితులయ్యారు. వారికి బుధవారం హైదరాబాద్‌లో ఒలింపిక్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీష్‌యాదవ్ నియామకపత్రాలు అందించారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘానికి గుర్తింపు ఇచ్చినందుకు రాష్ట్ర సంఘానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

క్రీడాకారులను వెలుగులోకి తేవాలి

▸▸ ఎస్ఏఐ అసిస్టెంట్ డైరెక్టర్ నిషా విద్యార్థి



డీవైఎస్‌వో శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న డైరెక్టర్ నిషా విద్యార్థి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభావంతులైన ఫుట్‌బాల్ క్రీడాకారులను వెలుగులోకి తేవాలని స్పోర్ట్స్ అథారిటీ ఇండియా (ఎస్ఏఐ) అసిస్టెంట్ డైరెక్టర్ నిషా విద్యార్థి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియంలో గల ఖేలో ఇండియా ఫుట్‌బాల్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులను శిక్షణ ఇచ్చేందుకు ఎస్ఏఐ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ఉదయం, సాయంత్రం మెరుగైన శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లా క్రీడాశాఖ అధికారులు శిక్షణా కేంద్రాలను పర్యవేక్షించాలని సూచించారు. క్రీడారంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియాను కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు వడెన్న, నగేష్, శిక్షకులు నికేష్, సునీల్‌కుమార్, పర్వేజ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడా పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సంక్షేమాధికారి జరీనా బేగం, డీవైఎస్‌వో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చందరంగం, పరుగుపందెం, షాట్‌ఫుట్, ట్రైసైకిల్, వీల్‌చైర్, క్యారమ్స్, షాట్‌ఫుట్, క్యారమ్స్ పోటీలను జూనియర్లు, సీనియర్లకు వేర్వేరుగా నిర్వహించారు. విజేతలకు డిసెంబర్ మూడున బహుమతులను ప్రదానం చేయనున్నారు.

24న జిల్లా మహిళ కబడ్డీ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీలో పాల్గొననున్న మహబూబ్‌నగర్ జిల్లా మహిళ జట్టు ఎంపిక కోసం ఈ నెల 24 పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో డిసెంబర్ ఏడు నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్‌కు చెందిన క్రీడాకారులు ఉదయం తొమ్మిది గంటలకు ఒరిజినల్ ఆధార్ కార్డుతో హాజరుకావాలని కోరారు.

క్రైం కార్నర్

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

▸▸ మరొకరికి రూ. 1000 జరిమానా

పాన్‌గల్, అమరచింత, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఒకరికి జైలు శిక్ష, మరొకరికి జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. అమరచింత మండలం కృష్ణంపల్లి గ్రామానికి చెందిన సంజీవులు అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. పోలీసులు అతడిపై కేసునమోదు చేసి బుధవారం వనపర్తి కోర్టులో హాజరు పరిచారు. అతడికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు. అలాగే పాన్‌గల్ మండలం, కొత్తపేట గ్రామానికి చెందిన పంటికూర రవి మద్యం తాగి ద్విచక్రవాహనం నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అయినా అతడు దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులు కేసు నమోదు చేసి, బుధవారం వనపర్తి కోర్టులో హాజరు పరిచారు. అతడికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.


ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలు భరించ లేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడకు చెందిన మొగిళ్ల బొబ్బిలి (36) తరచు మద్యం తాగి భార్య రేణుకతో గొడవ పడేవాడు. అదే విధంగా మంగళవారం మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. ఆ తర్వాత పొలానికి వెళ్లి వేపచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి అన్న మొగిళ్ల లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బావిలో పడి ఆవు మృతి

తాడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామంలో బుధవారం ఓ ఆవు నీరు తాగేందుకు బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న రైతు శివయ్య బావి వద్దకు చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు. దాదాపు రూ. 60 వేల విలువైన పాలిచ్చే ఆవు మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థుల సహకారంతో ఆవు కళేబరాన్ని బావిలో నుంచి బయటకు తీశారు.

కోట బురుజులు చరిత్రకు ఆనవాళ్లు



చౌదూర్‌లోని బురుజు

- సంస్థానాధీశుల కాలంలో నిర్మాణం - వాటిపై నుంచి సైనికుల నిఘా
- శిథిలం అవుతున్న అలనాటి కట్టడాలు - కాపాడాలని కోరుతున్న ప్రజలు

నవాబ్‌పేట, పెద్దకొత్తపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చరిత్రకు ఆనవాళ్లయిన కోట బురుజులు క్రమంగా శిథిలం అవుతున్నాయి. నిజాం నవాబులు, సంస్థానాధీశుల కాలంలో శత్రువుల నుంచి రాజ్యాన్ని కాపాడుకునేందుకు పలు రక్షణ చర్యలు తీసుకున్నారు. రాజ్యంలోని ప్రధాన పట్టణాలు, పెద్ద కొండలపై కోటలు నిర్మించుకొని, అక్కడి నుంచే పాలన సాగించారు. అలాగే గ్రామాల సంరక్షణ కోసం ఊరి చుట్టూ రాతి గోడ నిర్మించి, నాలుగు వైపులా బురుజులు ఏర్పాటు చేశారు. వాటిపై సైనికులు ఉండి నిరంతరం కాపలా కాసేవారు. శత్రువుల ఉనికిని దూరం నుంచే పసిగట్టి, పాలకులను అప్రమత్తం చేసేవారు. కాలక్రమంలో రాజులు పోయారు, రాజ్యాలు కూలిపోయాయి. అలాగే ఆనాటి కట్టడాల సంరక్షణకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని చోట్ల పూర్తిగా కనుమరుగవగా, మరికొన్ని చోట్ల కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని ఊర్లలో స్థానికులే రాళ్ల కోసం వాటిని ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. ఇంకొన్ని గ్రామాల్లో నేటికీ చెక్కు చెదరకుండా ఉండి అలనాటి చరిత్రను చాటి చెప్తున్నాయి. నవాబ్‌పేట మండలంలోని యన్మనగండ్ల, కారుకొండ, తీగలపల్లి, కాకర్లపాడ్, చౌదూర్, హన్మసానిపల్లి, రుక్కంపల్లి, ఇప్పటూర్, కూచూర్ తదితర గ్రామాల్లో ఇప్పటికీ బురుజులు ఆనాటి చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్నాయి.

ఇప్పటూర్ గ్రామంలో మట్టి, రాయితో నిర్మించిన కోట గోడలు నేటికి స్థిరంగా ఉన్నాయి. యన్మనగండ్ల గ్రామ పంచాయతీ పక్కనున్న బురుజుకు నాలుగు సంవత్సరాల క్రితం అప్పటి సర్పంచ్ జరీనారఫూఫ్ షరీఫ్ మరమ్మతు చేయించారు. చౌదూర్ గ్రామంలో దాదాపు రెండు వందల సంవత్సరాల క్రితం కోట బురుజులు ఇప్పటికీ చెక్కు చెదరలేదు. చరిత్రకు ఆనవాళ్లయిన బురుజులకు మరమ్మతులు చేసి, వినియోగంలోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. స్వాతంత్ర దినోత్సవం, రిపబ్లిక్ డే, రాష్ట్ర అవతరణ దినోత్సవం తదితర వేడుకల సందర్భంగా బురుజులపై జాతీయ పతకాలు ఎగురవేస్తే బాటుంటుందని ఆయా గ్రామాల ప్రజలు సూచిస్తున్నారు.

పెద్దకొత్తపల్లి మండలంలోని ఆదిరాల, యాపట్ల, మరికల్, గంట్రావుపల్లి, చంద్రకల్, ముష్టిపల్లి గ్రామాల్లో చోళులు, కాకతీయ రాజులు నిర్మించిన కోట బురుజులు నేటికీ చెక్కు చెదరలేదు. అలాగే కాకతీయుల కాలంలో నిర్మించిన దేవుని తిర్మలాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయం, కల్వకోల్‌లో నంది కోటేశ్వరాలయాలు ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతున్నాయి. నేటికీ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

కాపాడుకోవడం మన బాధ్యత




భోజయ్యచారి, కూచూర్ : చరిత్రకు సాక్ష్యాలుగా ఉన్న కోట బురుజులను కాపాడుకోవడం మనందరి బాధ్యత. అలాగే ప్రభుత్వం కూడా స్పందించి బురు జులకు మరమ్మతులు చేయించాలి. వాటిపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే రక్షణ పరంగా గ్రామాలకు మేలు జరుగుతుంది.

చరిత్రకు ఆనవాళ్లు



గవిండ్ల రాజు, కారుకొండ : కోట బురుజులు గ్రామాల చరిత్రకు ఆనవాళ్లు. వీటిని కాపాడుకోవడం మన బాధ్యత. మండలంలోని చాల గ్రామాల్లోని బురుజులు శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వం స్పందించి వాటిని పునర్నిర్మించాలి. పురావస్తు శాఖ అధికారులు వీటికి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.





యన్మనగండ్ల, గంట్రావుపల్లి గ్రామాల్లోని కోట బురుజులు

చాయ్ కాకా

▸▸ కందనూలులో ఫేమస్ మైనొద్దీన్ 'మొబైల్ టీ'

▸▸ ఫోన్‌లో ఆర్డర్ ఇస్తే చేతికందే తేనీరు



టీ ఫ్లాస్కుతో చాయ్ కాకా మైనొద్దీన్

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 20 : చాయ్ కాకా! నాగర్‌కర్నూల్ పట్టణ వాసులకు చిరపరిచితమైన పేరు.. అసలు పేరు మైనొద్దీన్. ముప్పై సంవత్సరాల నుంచి చాయ్ విక్రయిస్తూ జీవనం గడుపుతున్నాడు. చక్కగా నవ్వుతూ.. నాలుగు మంచి మాటలు చెప్తూ.. యోగ క్షేమాలు తెలుసుకుంటూ వినియోగదారులను ఆకట్టుకుంటున్నాడు. ఫోన్‌లో ఆర్డర్ ఇచ్చినా ఫ్లాస్క్‌లో తీసుకెళ్లి ఇస్తాడు.

30 ఏళ్ల క్రితం ప్రారంభం

చాయ్ కాకా మైనొద్దీన్ దాదాపు ఎనిమిదేళ్ల క్రితం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదురుగా, సాయిగార్డెన్స్‌కు వెళ్లే దారిలో ప్రధాన రహదారి పక్కన చిన్న టీ స్టాల్ ఏర్పాటు చేసుకున్నాడు. తెల్లవారుజామునే చాయ్ సిద్ధం చేసుకొని ఫ్లాస్క్, గ్లాసులతో తన టీ కొట్టు నుంచి బయలు దేరుతాడు. దూరం వెళ్లాల్సి వచ్చినప్పుడు తన స్కూటీపై వెళ్తాడు. పట్టణంలోని రద్దీ వీధులు, స్కూళ్లు, కాలేజీలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, కూరగాయల మార్కెట్లు, వాణిజ్య సముదాయాలు ఇలా అన్ని ప్రాంతాల్లో ఆయనకు రెగ్యులర్ వినియోగదారులున్నారు. అతడే టీ కొట్టు ప్రారంభించినప్పుడు కప్పు చాయ్ ఒక్క రూపాయి ఉండేది. ప్రస్తుతం చాయ్ ధర ఎనిమిది రూపాయలకు చేరింది. తాను ప్రతీ రోజు 500 కప్పుల టీ అమ్ముతానని తెలిపారు.



నాగర్‌కర్నూల్‌లోని తన హోటల్‌లో చాయ్ కాకా

ఏ పనైనా ఇష్టంతో చేయాలి

మైనొద్దీన్ : ఏ పనైనా ఇష్టంతో గౌరవంగా చేయాలి. పట్టణంలో తిరుగుతూ చాయ్ అమ్ముకోవడం నాకెప్పుడూ ఇబ్బంది అనిపించలేదు. ప్రతీ రోజు తెల్లవారుజామునే నా రెగ్యులర్ కస్టమర్లను చాయ్‌తో పలకరించడం చాలా అనందాన్ని ఇస్తుంది. చాయ్‌తోనే నా జీవితాన్ని నిలబెట్టుకున్నాను. ఇలా వచ్చిన డబ్బుతోనే ఇల్లు కట్టుకున్నాను. ఇద్దరు కుమార్తెలను చదివించుకుంటున్నాను.

గుజరాత్ రైతుల పైనే ప్రేమ

▸▸ తెలంగాణ రైతులపై ఎందుకు లేదు ▸▸ కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి

▸▸ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతు ▸▸ ఊట్కూరులో కాటన్ మిల్లు పరిశీలన



సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఊట్కూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గుజరాత్ రాష్ట్ర రైతులపై ఉన్న ప్రేమ, తెలంగాణ, ఇతర రాష్ట్రాల రైతులపై ఎందుకు లేదో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెప్పాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతు డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ప్రతినిధి బృందం సభ్యులు బుధవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని విజయ కాటన్ ఇండస్ట్రీస్, మక్తల్‌లోని వినాయక్ కాటన్ మిల్లులను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వారితో కలిసి మిల్లు మెందు ఆందోళన చేపట్టారు. అనంతరం భగవంతు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గుజరాత్ రాష్ట్రంలో పత్తికి రూ. 8,500 ఇస్తోందని, సీసీఐ ఆధ్వర్యంలో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో రూ. 7,521 మాత్రమే ఇస్తోందని తెలిపారు. అక్కడి రైతులపై ఉన్న ప్రేమ ఇక్కడి రైతులపై ఎందుకు లేదని ప్రశ్నించారు.

రైతులు ఎకరానికి రూ. 40వేల నుంచి రూ. 60 వేల వరకు పెట్టుబడి పెట్టి పత్తి సాగు చేస్తే, వర్షాలకు పంట దెబ్బతిని 50 శాతం మాత్రమే దిగుబడి వచ్చిందని చెప్పారు. 33 శాతం నష్టం వాటిల్లినా పరిహారం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం 50 శాతం నష్టం జరిగినా స్పందించడం లేదని ఆరోపించారు. బస్తాల్లో తెచ్చిన పత్తిని కొనుగోలు చేయబోమంటూ సీసీఐ అధికారులు రైతులను ఇబ్బంది పెడ్తున్నారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పత్తి క్వింటాల్‌కు రూ. 18,500 చెల్లించి కొనుగోలు చేయాలన్నారు. సమగ్ర ఖర్చుల ప్రతిపాదికన కనీస మద్దతు ధరను నిర్ణయించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో దళారుల దోపిడీని అరికట్టాలన్నారు. అంతకు ముందు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సలీం, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి కనకరాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, బాబు, లింగప్ప, రాజు, కిరణ్, రైతులు గుర్రాల నర్సింహులు, బోర్ర బాలప్ప, హోటల్ శివ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడిన తొమ్మిది మందిపై కేసు



పట్టుబడిన నిందితులతో అటవీశాఖ అధికారులు

బల్మూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని నల్లమల అడవిలో వన్యప్రాణులను వేటాడిన తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు అచ్చంపేట క్షేత్ర స్థాయి అధికారి అబుల్ సూరత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండనాగులకు చెందిన అంకెల కాసీం, మల్లయ్య, బ్రాహ్మణపల్లికి చెందిన ఎరుగడ్డి రమేష్, మూడావత్ రాజులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితులను కల్వకుర్తి సివిల్ కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

లారీ నడుపుతుండగా డ్రైవర్‌కు గుండె నొప్పి

▸▸ అదుపు తప్పి బోల్తా పడిన వాహనం



జాతీయ రహదారి పక్కన బోల్తాపడిన లారీ

అలంపూర్ చౌరస్తా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : లారీ నడుపుతుండగా, డ్రైవర్‌కు గుండె నొప్పి రావడంతో అదుపుతప్పి బోల్తాపడింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆళ్లగడ్డకు చెందిన డ్రైవర్ పుల్లయ్య గోధుమ పిండి బస్తాల లోడ్ ఉన్న లారీతో మంగళవారం సాయంత్రం హైదరాబాదు నుంచి ప్రొద్దుటూరుకు బయలు దేరాడు. మార్గంమధ్యలో ఉండవల్లి శివారులో జాతీయ రహదారిపై వెళ్తుండగా, ఆయనకు గుండె నొప్పి, ఆ వెంటనే ఫిట్స్ రావడంతో లారీ అదుపు తప్పింది. అయినా ఆపకుండా లారీని రోడ్డు పక్కకు పోనివ్వడంతో బోల్తా పడింది. వెంటనే క్లీనర్ సలీం వెంటనే అతడిని బయటకు లాగి, 108 అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం పుల్లయ్య కోమాలో ఉన్నట్లు కుమారుడు నాగరాజు తెలిపారు.

గురుస్థానం మహోన్నతం

▸▸ బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ ▸▸ భక్తిశ్రద్ధలతో అవధూత నరసింహ స్వామి ఆరాధనోత్సవాలు



అవధూత నరసింహ స్వామి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



గాయత్రి హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు

నారాయణపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గురుస్థానం మహోన్నతమైనదని, అవదూత స్వామి మహిమలు అపారమని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ అన్నారు. నారాయణపేట సుబాష్‌రోడ్‌లోని సద్గురు అవధూత నర్సింహస్వామి 133వ ఆరాధనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈనెల 18న ప్రారంభమైన ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్ రెడ్డి పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మఠం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో, వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య గురు గాయత్రీ సామూహిక హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహస్వామికి కాగడా హారతి, రుద్రాభిషేకం చేశారు. మహా మంగళహారతి అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవాల్లో జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఇంటర్వ్యూ..



శాంతి భద్రతలకు సహకరించాలి

» ఎస్‌ఐ శ్రీనివాసులు

కేటీదొడ్డి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి. ప్రజలతో మమేకమై శాంతి భద్రతల విషయంలో పూర్తిస్థాయి సహకారం అందిస్తాం. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

రాత్రి వేళ సిబ్బందిని నియమించి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. రాత్రివేళ ఇంటి ముందు విద్యుత్ బల్బులు వెలిగేలా చూడాలి.

రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టే చర్యలు?

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ప్రతీ గ్రామంలో అవగాహన కల్పిస్తున్నాం. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించి వాహనం నడపాలి.

యువతకు మీరిచ్చే సందేశం?

ప్రతీ ఒక్కరు లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఆ దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలి. మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి వ్యాయామం అలవాటు చేసుకోవాలి.

న్యూస్ బాక్స్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గద్వాలటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించి దేశాన్ని పాలించే స్థాయికి ఎదిగేలా వారికి తోడ్పాటును అందించాలని జిల్లాకు చెందిన సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ ప్రేమ్‌కుమార్ కోరారు. రాష్ట్ర మహిళా విశ్వవిద్యాలయ (చాకలి ఐలమ్మ యూనివర్సిటీ) కొత్తగా నియమితులైన వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్యధనుంజయను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

గద్వాల న్యూటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం గట్టు మండలం బోయలగూడెంకు చెందిన నాగమ్మకు మెరుగైన చికిత్స నిమిత్తం రూ.36,000 చెక్కును ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అదే విధంగా గద్వాల మండలం సంగాల గ్రామానికి చెందిన మహిళకు కల్యాణ లక్ష్మి చెక్కును అందజేశారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలకు నోటిఫికేషన్

గద్వాల టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా డిసెంబరు 3వ తేదీలోగా ఫీజు చెల్లించాలని జిల్లా పబ్లిక్ పరీక్షల కమిషనర్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్‌కు రూ.100, హైయర్ గ్రేడ్‌కు రూ.150, టైలరింగ్ లోయర్ గ్రేడ్‌కు రూ.150, టైలరింగ్ హైయర్ గ్రేడ్‌కు రూ.200 చెల్లించాలన్నారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబరు 10 వరకు, రూ.75 అపరాధ రుసుంతో డిసెంబరు 17వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు.

ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్‌గా రాజయ్య

అలంపూరు నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అలంపూరు, అయిజ, వడ్డేపల్లి మునిసిపాలిటీల ఇన్‌చార్జి కమిషనర్‌గా ఎస్ రాజయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీ అభివృద్ధికి పాటు పడాలని, సిబ్బంది ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

ప్రజాపాలన ఉత్సవాల్లో భాగస్వాములు కావాలి

ధరూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని తహసీల్దార్ మంగమ్మ కోరారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ఆధ్వర్యంలో చేపట్టిన కళాకారుల ప్రచార కార్యక్రమాలను బుధవారం ధరూరు, బురెడ్డిపల్లి, మార్లబీడు గ్రామాల్లో తహసీల్దార్ ప్రారంభించారు.

అరెస్టు అప్రజాస్వామికం

గద్వాలటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : లగచర్ల సంఘటనకు సంబంధించి నిజనిర్ధారణ కోసం వెళ్లిన మహిళా సంఘం నాయకురాలిని పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుభాన్, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. వారితో పాటు నిజనిర్ధారణకు వెళ్లిన పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నక్క నారాయణరావు, కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ, కుమ్మర విజయులను అరెస్టు చేసి పోలీసుస్టేషనులో నిర్బంధించడం చట్ట విరుద్ధమన్నారు. నాయకులను పోలీసులు అరెస్టు చేయడం ప్రజా పాలనకు పూర్తి విరుద్ధమని, ప్రభుత్వం బేషరత్తుగా అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలన్నారు.

ప్రారంభించారు.. వదిలేశారు

» పేరుకే పల్లె దవాఖానాలు » రోగులకు అందని సేవలు



ప్రారంభం నాటి నుంచి వృథాగా ఉన్న మాచర్ల పల్లె దవాఖాన

గట్టు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అధికారులు పట్టించుకోరు.. పాలకుల నిర్లక్ష్యం వెరసి ప్రభుత్వ భవనాలు ప్రారంభాలకే పరిమితమవుతున్నాయి. లక్షలు రూపాయలు వెచ్చించి.. నిర్మించి హంగు ఆర్భాటాలతో ప్రారంభిస్తారు. అనంతరం వాటి వినియోగం గాలికి వదలి వేయడం పరిపాటిగా మారింది. ఈ కోవకు చెందినదే మాచర్లలోని పల్లె దవాఖాన భవనం. గత ప్రభుత్వం గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవల కోసం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్ కింద పల్లె దవాఖానాలు నిర్మించింది. వీటి ద్వార ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని భావించారు. కానీ ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. మాచర్లలో ఎన్నికల ముందు భవనం అసంపూర్తిగా ఉన్నప్పటికీ హడావుడిగా ప్రారంభించారు. అంతే ఆ రోజు నుంచి నేటి వరకు ఈ కేంద్రం తెరచిన దాఖలాలు లేవు. ఆయుష్మాన్ భారత్ కింద నిర్మించిన ఈ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడటంతో వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. మాచర్లలోని ఈ భవనాన్ని వైద్య ఆరోగ్య శాఖకు కాంట్రాక్టర్ అప్పగించక పోవడం గమనార్హం.

పర్యవేక్షణ లేక అస్తవ్యస్తం..

మండలంలోని ఆరగిద్ద, మిట్టదొడ్డి, మాచర్ల, బోయలగూడెం, ఆలూరు, పెంచికలపాడు, గట్టు గ్రామాలకు ఆయుష్మాన్ మందిర్ కింద పల్లె దవాఖానాలు ఎంపిక చేశారు. కాగా గట్టుతో పాటు పెంచికలపాడులో భవనాలు నిర్మించలేదు. కేటీదొడ్డి మండలంలో కుచినెర్ల, నందిన్నె, చింతలకుంట ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లకు ఎంఎల్‌హెచ్‌పీలను నియమించారు. కానీ పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామాల్లో రోగులకు సరైన వైద్యం అందడం లేదు. పేరుకు మాత్రమే ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు ఉన్నా.. ఎప్పుడు తెరుచుకుంటాయో ఎప్పుడు వైద్యులు వస్తారో తెలియడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిపై చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి..

మండలంలోని ఆయుష్మాన్ కేంద్రాలు సక్రమంగా పనిచేయని విషయం నా దృష్టికి వచ్చింది. ఇక నుంచి రోజుకు రెండు కేంద్రాలను స్వయంగా పరిశీలిస్తా. వైద్యులు అందుబాటులో ఉండాలి. లేకుంటే చర్యలు తప్పవు.

- కేటీ రమేష్, వైద్యాధికారి

పఠనాసక్తితో ఆలోచనలకు పదును

» అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ » ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనంతో మెరుగైన ఆలోచనలు తటస్థియాని తద్వారా ప్రతీ అంశంలోను విజ్ఞతతో కూడి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. విద్యార్థులు పుస్తక పఠనను ఎట్టి పరిస్థితులలోను విస్మరించవద్దని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విద్యాభివృద్ధిలో వినియోగించాలని సూచించారు. వారం రోజుల పాటు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన 57వ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిసాయి. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్, డీపీవో శ్యాంసుందర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులుతో కలిసి సరస్వతీ దేవి, భరతమాత చిత్రపటాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన అదనపు కలెక్టర్ జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణం అన్ని వసతులతో త్వరతగతినా పూర్తయ్యేలా కృషి చేస్తానని, పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వపరంగా తగిన తోడ్పాటును అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా విజ్ఞానం లేని విద్య వ్యర్థమన్నా అదనపు కలెక్టర్ బాల్యంలో తాను చదివిన భాస్కర శతకంలోని పద్యాన్ని విద్యార్థులకు చదివి వినిపించారు. గ్రంథాలయాలకు స్థానిక సంస్థల ద్వారా అందాల్సిన సెస్ నిధులు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అందే తోడ్పాటుతో పాటు దాతలు సహకరించాలని కోరారు. జిల్లా గ్రంథాలయాల కార్యదర్శి శ్యాంసుందర్, గ్రంథాలయ అధికారి రామాంజనేయులు, సిబ్బంది ఉన్నారు. వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయం తరపున నిర్వహించిన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

కొనసాగిన సామాజిక తనిఖీ

» రూ.1,27,773 రికవరీకి ఆదేశం

» నలుగురు టీఏలు, 12 మంది ఎఫ్‌ఏలకు షోకాజ్ నోటీసులు



సామాజిక తనిఖీలో వివరాలు తెలుసుకుంటున్న డీఆర్డీవో నరసింగరావు

మానవపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 16 గ్రామాల్లో 2023-24 సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై అడిట్ బృందం గ్రామాల వారిగా తనిఖీ చేసి గ్రామ సభలు ఏర్పాటు చేసింది. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద డీఆర్డీవో నరసింగరావు ఆధ్వర్యంలో ప్రజావేదిక ఏర్పాటు చేయగా, తనిఖీ బృందం గ్రామాల్లో జరిగిన అక్రమాలను ప్రజావేదికలో బహిర్గతం చేశారు. మొత్తం 2023-24 సంవత్సరానికి గానూ రూ.2.80 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇందులో రూ.50 లక్షలు మెటీరియల్‌కు ఖర్చు కాగా, కూలీలకు రూ.2.30 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారుల తనిఖీలో వెల్లడైంది. కాగా గ్రామాల్లో ఉపాధి పనులకు సంబంధించిన సమాచారాన్ని రికార్డుల్లో పొందుపరుచడంలో నిర్లక్ష్యం వహిస్తున్నరని, కొర్విపాడు, బోరవెల్లి గ్రామాలతో పాటు ఇతర గ్రామాల్లో నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్, పల్లెప్రకృతి వనాల్లో చేసిన పనులకు గ్రామ పంచాయతీ అకౌంట్‌కి కాకుండా టీఏ రమేష్ భార్యపై, పంచాయితీ కార్యదర్శి నిర్మల భర్త పేర్ల మీదుగా ఉన్న అకౌంట్‌లోకి డబ్బును జమ చేసినట్లు తెలిపారు. ఇందులో మెటీరియల్‌కు ఖర్చు అయిన రూ.50 కోట్లలో రూ.1,27,773 రికవ రీకి ఆదేశించారు. ప్రతీ గ్రామంలో ఉపాధి పనుల పై ప్రజలకు అవగాహన కల్పించడంలో, జాబ్ కార్డులు రెన్యువల్ చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లు, 12 మంది ఫీల్డ్ అసిస్టెంట్లుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తనిఖీ బృందం సిబ్బంది వివిధ రికార్డుల జిరాక్స్ తెలుపలేదు. భోజనం, వీఎస్‌ఏలకు, రవాణ, ప్రజావేదిక కోసం రూ.74,345 ఖర్చు చేశారు. ప్రజా వేదికలో ఎంపీడీవో భాస్కర్, అంబుడ్స్ మెన్ జమ్మన్న, ఏపీవోలు నాయక్, శివశంకర్, ఎస్ఆర్పీ శ్రీకాంత్, డీఆర్పీలు రఘు, అనిల్, పంచాయితీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వ్యాసెక్టమీపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప

గద్వాల న్యూటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన మగ వారికి ఉచితంగా ఈనెల 28 నుంచి డిసెంబరు 4 వరకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాసెక్టమీపై ఆపరేషన్ నిర్వహిస్తారని డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్ప అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి ఈనెల 27 వరకు వైద్యసిబ్బంది, పారామెడికల్ సిబ్బంది కుటుంబ నియంత్రణలో భాగంగా అర్హులైన మగ వారికి వ్యాసెక్టమీపై ఆపరేషన్ గురించి అవగాహన కల్పించాలన్నారు. వ్యాసెక్టమీపై ఆపరేషన్‌లో కోత, కుట్టు ఉండదని, ఇది చాలా సులువైన కుటుంబ నియంత్రణ అన్నారు. అలాగే ఇతర ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా అనుమానిత క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి పరీక్షలు నిర్వహించి క్షయవ్యాధి నిర్ధారణ అయితే వెంటనే వారికి చికిత్సలు నిర్వహించాలన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నప్పుడు అనుమానిత కుష్టు వ్యాధిగ్రస్థులను గుర్తిస్తే వైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాంలో భాగంగా బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్సలు అందించాలన్నారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు రాజు, ప్రసూనరాణి, రిజ్వానా తస్వీర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

వడ్డేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి ఉండాలని శాంతినగర్ సీఐ టాటాబాబు అన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలల దినోత్సవం పురష్కరించుకుని మండలంలోని శాంతినగర్‌లో ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలన, మొబైల్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంవీఎఫ్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి పాల్గొన్నారు.

అధిక వసూళ్లు నియంత్రించండి

ఎర్రవల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయం దగ్గర భక్తుల నుంచి అధిక వసూళ్లను నియంత్రించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు బుధవారం బీఆర్‌ఎస్ మండల నాయకుడు నారాయణనాయుడు వినతిపత్రం అందించారు. గ్రామ పంచాయతీలో తీర్మానం చేసి వేలం పాట నిర్వహించి, రెండు చోట్ల టోల్‌గేట్‌లను ఏర్పాటు చేసి భక్తుల నుంచి విచ్చలవిడిగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా సంపత్‌కుమార్ జన్మదినం



కొండూరులో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉండవల్లి/ఇటిక్యాల/అయిజ/రాజోలి/ఎర్రవల్లి, నవంబరు 20 (ఆంధ్యజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ జన్మదిన వేడుకలను బుధవారం ఉండవల్లి, ఇటిక్యాల, అయిజ, రాజోలి, ఎర్రవల్లి మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండవల్లి మండల కేంద్రంలో బస్టాండు కూడలిలో ఆ పార్టీ నాయకులు వెంకట్‌గౌడు, అలంపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కేట్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఇటిక్యాల మండల కేంద్రంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కేట్ కట్ చేశారు. అయిజ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మధుకుమార్ కేక్ కట్ చేసిన అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మునిసిపాలిటీ కేంద్రమైన శాంతినగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, రాజోలిలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు. తుమ్మలపల్లి పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఎర్రవల్లి మండల కేంద్రంలో తాలుకా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాజీ సర్పంచ్ జోగుల రవి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ శ్రేణులు రక్తదానం చేశారు. కొండేరు పోతురాజ్ సోమనాద్రి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఇటిక్యాల మండల అధ్యక్షుడు రుక్మానంద్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేయగా, మరి కొందరు కాంగ్రెస్ నాయకులు బీచుపల్లి అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

రేపు బీసీ కమిషన్ చైర్మన్ ప్రజాభిప్రాయ సేకరణ

గద్వాల న్యూటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారి పరిస్థితులను తెలుసుకోవడానికి బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు ఈ నెల 22న మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ బీఎం సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని సమస్త వెనుకబడిన తరగతుల ప్రజానీకం బీసీ కమిషన్ బృందానికి ఆయా కులాల స్థితిగతులపై తమ అభిప్రాయాలను అందజేయాలని కోరారు. వ్యక్తులు నమోదిత, నమోదు కాని సంఘాలు తమ వాదనలకు మద్దతుగా తమ వద్ద ఉన్న సమాచారం, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేమణలను కమిషన్ ముందు హాజరై తెలియజేయవచ్చు అన్నారు. దరఖాస్తు దారులు ధ్రువీకరణ ఆఫిడవిడ్ రూ.20 నాన్ జ్యుడీషల్ స్టాంప్ పేపరుపై పత్రాలను సమర్పించాలని తెలిపారు.

ప్రజల వెంటే మేము

ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి



ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అయిజ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు, కార్యకర్తల వెంటే మేము ఉంటామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం అయిజ పట్టణంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే విజయుడుతో కలిసి పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 30 పడకల అసంపూర్తి ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. పక్కనే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలోకి వెళ్లి వైద్య సదుపాయాలను, వైద్యం గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందించాలని డాక్టర్లకు సూచించారు. తిక్క వీరేశ్వర ఆలయం వెనుక వంతెన నిర్మించాలని కోరటంతో అక్కడ పరిశీలించారు. నిధులకై ప్రభుత్వాన్ని కోరతానన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అభివృద్ధి విషయంలోను, సహకారం అందించటంలోనూ ఎప్పుడు ముందుంటామని తెలిపారు. దూప, దీప నైవేద్య అర్చకులకు గుర్తింపు కార్డులను జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి ఆచార్యుల ఆధ్వర్యంలో అందచేశారు. మునిసిపల్ చైర్మన్ దేవన్న, వైస్ చైర్మన్ నర్సింహులు, కౌన్సిలర్లు సురేష్, బీఆర్‌ఎస్ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, పల్లయ్య, నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఎన్ఎస్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి

ఎర్రవల్లి : మండలంలోనిజింకలపల్లి గ్రామ శివారులో ఉన్న ఎస్ఎన్ఎస్ ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్‌ను బుధవారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కోరారు. విష రసాయనాలు బయటకు వదులుతూ భరించలేని దుర్వాసన వెదజల్లుతున్న ఎస్ఎన్ఎస్ పరిశ్రమ ఐదు గ్రామాలకు తీవ్రతరమైన సమస్యగా మారిందని, ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా విచ్చలవిడిగా వ్యవహరిస్తున్న యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రవల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యయసాయాధికారి సక్రియానాయక్ అన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. కేంద్రానికి నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. తేమ శాతం 17లోపు ఉంటే మంచి ధర లభిస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో రవి, ఏఈవో నరేష్, ఐకేపీ వేణు పాల్గొన్నారు..

బాలల హక్కులు కాపాడాలి



మాట్లాడుతున్న ఎంవీ ఫౌండేషన్ చీఫ్ కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్

కేటీదొడ్డి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కులను సంరక్షించినప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందని సమాజంలో బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎంవీ ఫౌండేషన్ చీఫ్ కోఆర్డినేటర్ వై.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని వెంకటాపురం సమీపంలోని పాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఎంవీ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సుధారాణి మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడటంలో అందరూ బాధ్యత తీసుకోవాలని, బాలికలను ఉన్నత చదువులు చదివే విధంగా ప్రోత్సాహించాలన్నారు. కేటీదొడ్డి, గట్టు మండల విద్యాధికారులు వెంకటేశ్వరరావు, నల్లారెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక, డీసీపీయూ నరసింహ, యుగంధర్‌గౌడ్, వీరన్న, సవిత పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీ జ్ఞాపకశక్తిని పెంచుతుంది

అలంపూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వ్యాస రచన పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు జ్ఞాపక శక్తిని పెంపొందించుకునేందుకు ఉపయోగపడుతుందని ఎంఈవో అశోక్‌కుమార్ అన్నారు. ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో కొనసాగుతున్న బాలోత్సవం పిల్లల పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం అలంపూరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో వ్యాస రచన పోటీలను నిర్వహించారు. 6,7,8 తరగతులకు రోడ్డు ప్రమాదాల నివారణ అనే అంశంపై, 9,10 తరగతులకు లైంగిక వేధింపులు, మహిళల భద్రత అనే అంశాన్ని కేటాయించగా, ఈ పోటీల్లో 68 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జీహెచ్ శ్రీనివాసులు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అలీ అక్బర్, ఆశన్న, కళాకారులు అయ్యప్ప, నరసింహ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కేటీదొడ్డి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కామన్ సర్వీస్ సెంటర్ల నిర్వాహకులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని జిల్లా సీఎస్సీ కోఆర్డినేటర్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని కేటీదొడ్డి, నందిన్నె, చింతలకుంట, గువ్వలదిన్నె గ్రామాల్లో నిర్వహిస్తున్న సీఎస్సీ కేంద్రాలను తనిఖీ చేసి, మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ సేవలను ప్రజలకు అందించాలన్నారు. సీఎస్సీ డిస్ట్రిక్ మేనేజర్ శేఖర్, నిర్వాహకులు రవిబాబు, మౌలాలి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఇటిక్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన బుధవారం మండలంలోని మునుగాల గ్రామ శివారులో చోటు చేసుకొంది. కొత్తదేవరపల్లికి చెందిన వెంకట్రాములు బైక్‌పై గ్రామానికి వస్తుండగా మునుగాల గ్రామ శివారులో 34 డీ జూరాల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. గాయాలపాలైన వెంకట్రాములును చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రవేటు వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రామచంద్రారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అయిజ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ రకాల చేతి వృత్తుల వారు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం అయిజ పట్టణంలో ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వివిధ రకాల చేతివృత్తి పనుల వారితో ఆయన సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా విశ్వకర్మ యోజన కింద రూ.లక్ష అందజేస్తున్న విషయాన్ని ఆయన వారికి వివరించారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరు ట్రైనింగ్ పూర్తి చేసుకున్నా లోన్ మంజూరు కాలేదని, మరికొందరు రూ.50 వేలే బ్యాంకు అధికారులు ఇస్తున్నారని, టైలర్లకు సంబంధించిన దరఖాస్తులు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని వారు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా అయిజలో ఈ పథకం ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. బీజేపీ నాయకులు లక్ష్మన్‌గౌడు, శేఖర్, వినయ్, బసవరాజు, గణేష్ ఉన్నారు.

నకిలీ మద్యం పట్టివేత : కేసు నమోదు

గద్వాల క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యాన్ని తరలిస్తున్న వారిపై ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి వారి నుంచి ఆరు లీటర్ల మద్యాన్ని పట్టుకున్న సంఘటన అయిజ పట్టణ శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అయిజ పట్టణ శివారులో మంగళవారం రాత్రి ఎక్సైజ్ అధికారి విజయభాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు నిఘా ఉంచగా ఇద్దరు వ్యక్తుల మహీంద్రా స్కార్పియో వాహనంలో ఆరు లీటర్ల నకిలీ మద్యాన్ని తరలిస్తుండగా గద్వాల ఎక్సైజ్ అధికారులు పట్టుకోవడం జరిగిందన్నారు. వాహనాన్ని సీజ్ చేసి నలుగురు నిందితులపై కేసు నమోదు చేయడం జరిగింది. అందులో ఈడిగ చిన్న ఉరుకుందుగౌడును అరెస్ట్ చేయగా, ముగ్గురు నిందితులు బోయ రవినాయుడు, ఈడిగి పెద్ద ఉరుకుందు, బోయ భీమేష్ పరారీలో ఉన్నారు. నిందితులు గట్టు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన వారని తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి, ఎస్ఐలు వెంకటేష్, వీరేశలింగం ఉన్నారు.